క్లుప్తంగా

గ్రామ కమిటీ ఎన్నిక

ఉప్పునుంతల: మండలంలోని తిర్మలాపూర్‌లో శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి సమక్షంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పెరుమల శ్రీను, ఉపాధ్యక్షుడిగా గుడి సత్యయ్య, కార్యదర్శి బంగారి, ప్రధాన కార్యదర్శి రేణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నారాన్‌సింగ్, సహాయ కార్యదర్శి నరేష్‌ను, కోశాధికారి పర్వతాలును ఎన్నుకున్నారు. అదేవిధంగా కమిటీ సలహాదారులుగా బాల్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, లక్ష్మయ్య, బీసీ సెల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సందీప్ యాదవ్, ఎస్సీ సెల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శేఖర్ ఎన్నికయ్యారు.

దాణా బస్తాల అందజేత

వెల్దండ: మండల కేంద్రంలో చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన గొర్రెల లబ్ధిదారులకు శుక్రవారం పశు వైద్య శాలలో దాణా బస్తాలను డాక్టర్ శ్యామ్‌సుందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల పోషకాహారాన్ని ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందన్నారు. 24 మంది లబ్ధిదారులకు దాణాను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు గాలమ్మ, అచ్చాలు, ఎంపీటీసీ మోతిలాల్‌నాయక్, గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు కొండల్‌యాదవ్, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

కొల్లాపూర్: మైలారం సర్పంచ్ మషన్నపై అకారణంగా దాడి చేసిన కోడేరు ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశానికి హాజరయ్యారు. ఈనెల 16న కొల్లాపూర్‌కు మందకృష్ణ మాదిగ రానున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. యాదగిరి మాదిగ, పుట్టపాగ రాము, లక్ష్మణ్ తదితరులున్నారు.

వెదురుబొంగు సాగుకు రాయితీ

కొల్లాపూర్: వెదురుబొంగు సాగుకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తున్నట్లు ఉద్యాన శాఖ మండల అధికారి లక్ష్మణ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో ఎకరానికి రూ.40 వేల చొప్పున ప్రభుత్వ సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యానశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

తాడూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి తిరుపతయ్య అన్నారు. మండలంలోని సిర్సవాడ ఉన్నత పాఠశాలలో ఆయా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్రీడలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు



పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కొల్లాపూర్ జడ్జిలు ఆర్‌వీఎస్ నితిన్ తేజ, గుంతి జ్యోత్స్న హాజరై మాట్లాడారు. విద్యార్థుల చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. పది, ఇంటర్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.5వేలు అందజేస్తానని జడ్జి జ్యోత్స్న ప్రకటించారు. కార్యక్రమంలో అడ్వకేట్ల ప్రెసిడెంట్ వసంత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసరావు, నాగరాజు, బాలస్వామి, రాజేష్, హరికృష్ణ, రామలక్ష్మమ్మ, ఎస్‌ఐ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోలులో మాసూం బాబా ఉర్సు నాలుగురోజుల నుంచి కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ ఎస్‌కే ఖాజా, మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు, ఎంపీపీ ఉమామహేశ్వరి, జిల్లా కోఆప్షన్ మెంబర్ మతీన్ అహ్మద్, విజయరామారావు, మచ్చ రామకృష్ణ, జ్ఞానేశ్వర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

కల్వకుర్తి: తెలంగాణ ఉద్యమంలో తమ కలాన్ని, గళాన్ని వినిపించి ఉద్యమ వ్యాప్తికి తమ వంతు కృషి చేసిన కళాకారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని దుందుభీ కళాసేవా సమితి కళాకారులు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు విన్నవించారు. శుక్రవాం వెల్దండ మండల కేంద్రంలో ఎమ్మెల్యేను మండలానికి చెందిన కళాకారులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకయ్య, నిరంజన్, ప్రసాద్, పెద్దయ్య, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యూఎస్పీసీ ధర్నా

ఉప్పునుంతల: ఈనెల 12న శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని యూఎస్పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు జక్కా రామస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమన్వయంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దండ: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీపీ విజయ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గిరిజన తండాలకు బీటీరోడ్లు, నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు భవనాలను మంజూరు చేశామన్నారు. రూ.20 లక్షల చొప్పున 7 భవనాలు, గిరిజన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటైన తండాలకు 11 భవనాలు మంజూరు చేసినట్లు వివరించారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో కోట్ల విలువలు చేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని ఎంపీటీసీలు మోతిలాల్ నాయక్, చక్రవర్తిగాడులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. చిన్న కుంటలు, చెక్‌డ్యామ్‌లను కబ్జా చేశారని సభలో లేవనెత్తారు. పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శాంతి, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ రవికుమార్, డీఈఈ దుర్గాప్రసాద్, దేవన్న, ఆయా శాఖల మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



పెద్ద కొత్తపల్లిలో పాలాభిషేకం చేస్తున్న సంజీవాపూర్ గ్రామస్తులు

వెల్దండ: పాలమూరు ప్రాజెక్టుపై విధించిన స్టేను సుప్రీకోర్టు రద్దు చేయడంతో మండల కేంద్రంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై శుక్రవారం సీఎం కేసీఆర్ చిత్ర పటానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై మద్రాస్ కోర్టు విధించిన స్టేను సుప్రీంకోర్టు రద్దు చేసిందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తైతే నార్లాపూర్, సింగోటం, ఎదుల, వట్టెం, ఉదండపూర్ రిజర్వాయర్ల ద్వారా లక్షల ఎకరాలకు సాగురు అందుతున్నారు. అనంతరం ఎస్టీ రెసిడెన్షియల్ బాలికల వసతి గృహం, నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి భవనాలను ఆయన పరిశీలించారు. అదేవిధంగా రేషన్‌డీలర్ల సంఘం, కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ, వైస్ ఎంపీపీ శాంతి, సర్పంచ్ భూపతిరెడ్డి, దార్ల కుమార్, ఆయా గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: సంజీవాపూర్ గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి సంబరాలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చంద్రకల్ సర్పంచ్ బాల్‌నర్సింహా, లక్ష్మయ్య, నిరంజన్, రాముడు, వెంకటయ్య, నిరంజనమ్మ, సంజీవరావు, నారాయణ, ఆంజనేయులు, మల్లేష్, శ్రీను పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

పెద్ద కొత్తపల్లి: మండలంలోని దేవినేనిపల్లిలో శుక్రవారం రాత్రి విద్యుదాఘాతానికి ఇల్లు దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శారద కిష్టయ్య కుటుంబసభ్యులతో కలిసి గొర్రెలు మేపడానికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంభవించింది. దీంతో ఇంట్లో ఉన్న వస్తువులు కాలి బూడిదయ్యాయి. గమనించిన చుట్టుపక్కల వారు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు.

ఆర్థిక సాయం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో వారం రోజుల కిందట వేంకటేశ్వరస్వామి దేవాలయ అర్చకుడు శేషయ్యాచార్యులు అనారోగ్యంతో మృతిచెందాడు. పలువురు అర్చకులు, గ్రామస్తులు విరాళాలు సేకరించి ఆలయ ట్రస్టు చైర్మన్ జంగం జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

బహుమతుల ప్రదానం

పెద్ద కొత్తపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులను శుక్రవారం సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో దేవల్‌తిరుమలాపూర్ సర్పంచ్ సత్యం, ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, పీఈటీ బాలు, వెంకటస్వామి గౌడ్, సాయిశంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: పాఠశాల స్వీపర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కు ఎదుట నిర్వహిస్తున్న స్వీపర్లు రీలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు యాదగిరి గౌడ్, వెంకటయ్య గౌడ్, అర్జున్, మహ్మద్ అలీ, రామస్వామి, వెంకటస్వామి, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

తెలకపల్లి: మండలంలోని గౌరారంలో రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ జమ్ములు, ఉప సర్పంచ్ రాంరెడ్డి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నిధుల నుంచి మంజూరైన రూ.4 లక్షల నిధులతో పనులు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. రాజేందర్‌గౌడ్, లక్ష్మయ్య, మహెమూద్, పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి..

మండలంలోని గోలగుండంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గ్రంథాలయ జిల్లా చైర్మన్ హనుమంతురావు భూమి పూజ నిర్వహించారు.

డీఎస్పీ ప్రత్యేక పూజలు



వెల్దండ: మండలంలోని గుండాలలో అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం కల్వకుర్తి డీఎస్పీ ప్రార్థసారధి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు డీఎస్పీని సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు సంతోష్‌శర్మ, మురారిశర్మ, సురేష్‌శర్మ, కిషన్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణ సామగ్రి పంపిణీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని మంజుగుల గ్రామానికి చెందిన అంజమ్మకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ శుక్రవారం ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్‌ను అందజేశారు. ఇంటి నిర్మాణానికి సహకరించిన ఉప్పల వెంకటేష్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. జాగృతి జిల్లా కన్వీనర్ గణేష్, ఉన్నారు.

గొర్రెల పంపిణీలో అన్యాయం

కల్వకుర్తిరూరల్: రెండో విడుత గొర్రెల పంపిణీ కురుమ యాదవులకు అన్యాయం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్వకుర్తిలో జిల్లెల్లలో 22 మంది కురుమ యాదవులు డిపాజిట్ సొమ్ము చెల్లించారని కాని అందులో 12 మందికి మాత్రమే గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారన్నారు. ఇప్పటికైనా డిపాజిట్ చేసిన వారందరికి గొర్రెలను అందజేయాలని కోరారు.

కాల్వ నిర్మాణ పనులు ప్రారంభం

తెలకపల్లి: మండలంలోని రాకొండలో కాల్వ నిర్మాణ పనులను శుక్రవారం బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు గుంపల్లి పర్వతాలు ప్రారంభించారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి రూ.25 లక్షల నిధులతో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ లింగారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కృష్ణమాచారి, కొట్టె శ్రీను, భీరయ్య, నరేష్, గోపాల్, రామకృష్ణ, నిరంజన్, శివ, వెంకటయ్య, అశోక్, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం



బిజినేపల్లి: ఆయుర్వేదంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని డాక్టర్ అరుణ అన్నారు. శుక్రవారం మండలంలోని శాయిన్‌పల్లిలో ఉచిత ఆయుర్వేద క్యాంప్‌ను నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఫార్మాసిస్ట్ డా. మురళీకృష్ణగౌడ్, వైద్య ఆరోగ్య సిబ్బంది జాహంగీర్‌బాబా, వై. శ్రీనివాస్, రామలింగం, ఆశాలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

లింగాల: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, అన్ని రకాల పెండింగ్ బిల్లులను ఈ నెల చివరి వరకు చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్య శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించి పీఆర్టీయూ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ నుంచి పెండింగ్‌లో ఉన్న జిల్లా పరిషత్ జీపీఎఫ్ డబ్బులు, సరెండర్, పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు.



లింగాల ఉన్నత పాఠశాలలో సభ్యత్వ సమోదును నిర్వహిస్తున్న పీఆర్టీయూ నాయకులు

కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురుషోత్తం, అంజిలాల్, రాములునాయక్, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాజు, గోపాల్‌నాయక్, హెచ్‌ఎంలు శేఖర్, పర్వతాలు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి వెంటనే వేతన సవరణ కమిటీని నియమించాలని తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం (తపస్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉద్యమ జాగరణ కార్యక్రమంలో భాగంగా స్థానిక పాత కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం నూతన కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దెంది రాజారెడ్డి, ఉద్యమ కార్యాచరణ పర్యవేక్షకుడు కర్నాకర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, సురేఖ, శారద, మల్లిఖార్జున్, పెంట్యా నాయక్, ప్రవీణ్, భాస్కర్‌గౌడ్, రాజశేఖర్, కట్టా రాజశేఖర్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వంగూరు: మండలం కొండారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రాంనగర్ స్టేజీ వద్ద సేకరించిన భూమిలో 50 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఇదివరకే అర్హులను ఎంపిక చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. అర్హుల జాబితాలో అనర్హులు ఉన్నారని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మరోసారి గ్రామంలో సర్వే నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక చేయాలని తీర్మానించారు. పారదర్శకంగా ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం నాయకులు ఆంజనేయులు, శివరాములు, బాలస్వామి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, సర్పంచ్ భారతమ్మ, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



కొల్లాపూర్ రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయిలు వేధింపులకు గురైతే వెంటనే షీ టీం నెంబర్ 8712657676 కు లేదా 100 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య చెప్పాలన్నారు. షీటీం మెంబర్లు వెంకటయ్య, హెడ్ కానిస్టేబుల్ వెంకట్ నాయక్ ఉన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

తాడూరు: మండలంలోని పాపగల్లు, లచ్చిరాం తండా, ఇంద్రకల్ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఎంఈఓ భాస్కర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. శిక్షణలో నేర్చుకున్న వివిధ అంశాలను సమర్థవంతంగా వివరించి విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు

చారకొండ/తాడూరు: చారకొండ తహసీల్దార్‌గా కేసీ ప్రమీల, తాడూరు తహసీల్దార్‌గా హెచ్ ప్రమీల శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

కాంగ్రెస్‌లో చేరిక



అమ్రాబాద్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో పదర మండల బీఆర్ఎస్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి స్వామినాయక్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం చిట్లంకుంట గ్రామానికి చెందిన 20 మంది కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో రాసనూరి మహేష్, రేఖయ్య, అజ్జు, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ నాయకుడు, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమక్షంలో మండలంలోని గుండూరు, వేపూరు, జిల్లెల్ల గ్రామాలకు చెందిన పలువురు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుండూరు మాజీ సర్పంచ్ వెంకటయ్య, వేపూరు మాజీ ఎంపీటీసీ రాములు, నాయకులు శ్రీరాములు, మహేందర్, వెంకట్, పాండు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను మరచిపోవద్దు

కందనూలు: మహనీయులను మరచిపోవద్దని ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కవి వనపట్ల సుబ్బయ్య రచించిన బహుజన బావుటా కావ్య పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడగుల విద్య, సామాజిక దురాచారాలు, కుల నిర్మూలన కోసం నిరంతరం పోరాడిన మహానుబావుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. పూలే జీవితం, పోరాటాలపై దీర్ఘ కావ్యాన్ని రచించిన కవి వనపట్ల సుబ్బయ్యని ఆయన అభినందించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాబురావు, మన్నెపు రెడ్డి, భాస్కర్ గౌడ్, సుబ్బారెడ్డి, కవులు డి. రాములు, వహీద్ ఖాన్, మహమ్మద్ ఖాజా, జర్నలిస్టు కందికొండ మోహన్, మురళీధర్ రావు, గాజుల వెంకట్‌స్వామి, టైలర్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.



కావ్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

అభివృద్ధి పనులకు భూమిపూజ

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని కుమ్మెరలో రూ.1.22 కోట్లతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలు, అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. అనంతరం పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డంపల్లి శ్రీదేవీ, నాయకులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేద్దాం

కల్వకుర్తిరూరల్: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే కోరుతూ ఈ నెల 12న శనివారం నిర్వహించనున్న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని పాత పెన్షన్ సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నరసింహారావు కోరారు. శుక్రవారం పలు పాఠశాలల వద్ద పోస్టర్లను విడుదల చేశారు.

స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు మరచిపోలేం



కొల్లాపూర్: దేశం కోసం ప్రాణాలు అర్పించిన స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు మరచిపోలేమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ అన్నారు. మేరీ మట్టి, మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటారు. అనంతరం దేశనాయకులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కురుమయ్యతో పాటు అధ్యాపకులు ఉన్నారు.

శుద్ధజలం ప్లాంట్ ప్రారంభం

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సౌజన్యంతో రూ.1.50 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన శుద్ధ జలం ప్లాంట్‌ను శుక్రవారం సర్పంచ్ నాగ రవిశంకర్ ప్రారంభించారు. ఫౌండేషన్ సమన్వయ కర్త శ్రీనివాసరావు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు.

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ ప్రైవేట్ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. సిద్దాపూర్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బొమ్మన్‌పల్లికి చెందిన యాదాచారి సిద్దాపూర్ నుంచి సొంత గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. గుర్రాలబండ వద్ద అచ్చంపేట నుంచి బక్కలింగాయపల్లికి వెళ్తున్న ఆర్టీసీ ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. యాదాచారి కుడికాలికి తీవ్రగాయమైంది. బస్సు డ్రైవర్ దేవేందర్ అజాగ్రత్తగా నడిపి తన భర్త ప్రమాదానికి కారమయ్యాడని స్రవంతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

కల్వకుర్తిరూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తాండ్ర గ్రామానికి చెందిన రాఘవరెడ్డికి రూ.1.50 లక్ష, కృష్ణమ్మకు రూ.27000 వేలు సీఎం సహాయనిధి నుంచి మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా వీరోంకా వందన్

బిజినేపల్లి: దేశ సైన్యంలో సేవలు అందించిన మండలానికి చెందిన సైనికులను బీజేపీ ఆధ్వర్యంలో మిట్టికో నమన్–వీరోంకా వందన్ కార్యక్రమంలో భాగంగా సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన విశ్రాంత సైనికుడు నెల్లికంటి రామకృష్ణరెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుబ్బారెడ్డి ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్లమెంట్ విస్తారక్ కేతూరి బుడ్డన్న, మండల అధ్యక్షుడు గుమ్మకొండ భూషయ్య, నాయకులు బాలస్వామి, కదారి కృష్ణ, నారాయణచారి, రమేష్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

కొల్లాపూర్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జోనల్ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడప గడపకు కమలం–గుండె గుండెకు ఎల్లేని కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుండటంతో సంతోషం వ్యక్తం చేశారు. శేఖర్‌గౌడ్, సాయికృష్ణగౌడ్, పదర భీమేష్, అన్వేష్, కృష్ణ, శ్రీధర్‌రెడ్డి, భరత్‌చంద్ర తదితరులున్నారు.

సార్వభౌమత్వాన్ని కాపాడుదాం



అచ్చంపేట రూరల్: దేశ ఐక్యతకు కట్టుబడి, సార్వభౌమత్వాన్ని కాపాడుదామని బీజేపీ అసెంబ్లీ కోఆర్డినేటర్ మండికారి బాలాజీ అన్నారు. శుక్రవారం పట్టణంలో మేరీమాటీ– మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరులకు నివాళి అర్పించారు. అనంతరం యువకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీష్‌మాదిగ, నాగరాజు, సైదులు, రేణయ్య, జగదీష్‌గౌడ్, భరత్‌చారి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి రెండో ఏఎన్ఎంల వినతి



కొల్లాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న రెండో ఏఎన్ఎంలు

కొల్లాపూర్: రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఆర్ ఇందిర డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తాలో మానవహారం ఏర్పాటుచేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనందరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, యూసూఫ్, మంజుల, సరళ, పుష్ప, రాజేశ్వరీ, వెంకటయ్య, చంద్రకళ, సుమతి, జయమ్మ, రాధిక, సువర్ణ, తదితరులున్నారు.

కల్వకుర్తి టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండో ఏఎన్ఎంలు శుక్రవారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. సుజాత, వరలక్ష్మి, శంకుతల, జ్యోతి, భాగ్యమ్మ, శ్రీవిద్య, తిరుపతమ్మలు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన హెల్త్ అసిస్టెంట్ల నియామక నోటిఫికేషన్ రద్దు చేసి తక్షణమే కాంట్రాక్టర్ ఏఎన్ఎంలను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సెకండ్ ఏఎన్ఎంలు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు సుగుణ, హైమావతి, కృష్ణవేణి, లక్ష్మి, నర్సమ్మ, కళావతి, మీనాకుమారి, స్వేత, వనజ, సీఐటీయూ నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజేషన్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం అచ్చంపేటలో సెకండ్ ఏఎన్ఎంలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. శ్రీనివాసులు, శ్రీవిద్య, హిమబిందు, పద్మ, ప్రభావతి, నీల పాల్గొన్నారు.